# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 96 ఫిర్యాదులు

కామారెడ్డి,మే 05 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణి నుంచి 96 వినతులను స్వీకరించామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ,పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఓ దివ్యాంగుడి వద్దకు వచ్చి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## సబ్ కలెక్టర్ క్షేత్ర పర్యటన



ముంబాజీపేట గ్రామంలో పర్యటిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట, మే 5 : లింగంపేట మండలంలోని ముంబాజీపేట గ్రామంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి క్షేత్ర పర్యటన నిర్వహించారు. భూ భారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం రైతులు చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారు. ముంబాజీపేట గ్రామంలో సర్వే నంబర్ 151, 302లో అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్య ఉన్న సమస్యపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి సబ్ కలెక్టర్ పర్యటించారు. సబ్ కలెక్టర్ వెంట నాయబ్ తహసీల్దార్ భరత్, పంచాయతీ కార్యదర్శి పవన్‌తో పాటు అటవీ శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రెండు రోజులు కోర్టు విధులకు దూరంగా న్యాయవాదులు

కామారెడ్డి, మే 5 : కామారెడ్డి బార్ అసోసియేషన్ సభ్యుడు సీనియర్ న్యాయవాది కులకర్ణి మోహన్ రావు, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని ఆదివారం అనారోగ్యంతో వేర్వేరు ప్రాంతాలలో కన్నుమూశారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద రమేశ్, ప్రధాన కార్యదర్శి బండారి సురేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి సంతాప సూచకంగా రెండు రోజులపాటు కోర్టు విధులకు దూరంగా ఉండాలని నిర్ణయించామని తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కోర్టులో సంతాపసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## విద్యార్థులకు టాలెంట్ టెస్టు



ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తున్న పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ సభ్యులు

కామారెడ్డి, మే 5 : పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రగతినగర్ విద్యానికేతన్‌లో ఉచిత విద్యను అభ్యసించడానికి సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విద్యార్థులు సోమవారం టాలెంట్ టెస్ట్ రాశారు. దీనికి సంబంధించి ప్రశ్నాపత్రాలను ట్రస్టు సభ్యులు ఆవిష్కరించారు. 19 మంది విద్యార్థులు పరీక్ష రాశారని నిర్వాహకులు తెలిపారు. 5, 6, 7వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తల్లిదండ్రులు లేని విద్యార్థులు, ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థుల కోసం డిగ్రీ వరకు ఉచిత విద్యను పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్ట్ వారు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, సీపీఎం జిల్లా నాయకులు చంద్రశేఖర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర బాధ్యుడు రాజవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరున్, బీడీఎస్ఎఫ్ నాయకుడు విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల అందజేత



విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న రాంరెడ్డి

బాన్సువాడ రూరల్, మే 5 : బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామంలో 11 రోజుల పాటు భగవద్గీత, భరతనాట్యంపై శిక్షణ అందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు భగవద్గీత పుస్తకాలను గ్రామానికి చెందిన పెద్దరాంరెడ్డి సోమవారం అందజేశారు. మనదేశ సంప్రదాయం, సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని అన్నారు. భగద్గీత పఠనంతో విద్యార్థుల్లో అధ్యాత్మికత పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో గిరిజా, గాయత్రి, సవిత, భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం వాయిదా

లింగంపేట, మే 5 : మండలంలోని పర్మళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. ముందుగా సోమవారం ప్రారంభించాలని నిర్ణయించినప్పటికీ వాయిదా వేసి బుధవారం ప్రారంభించనున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు. రైతులు పండించిన జొన్నలను దళారులకు కాకుండా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

నస్రుల్లాబాద్, మే 5 : బీర్కూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన సరస్వతి (58)ఈ నెల 2వ తేదీన ఇంట్లో పూజ చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. కాగా నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

## కొలతల ప్రకారం పని చేస్తేనే కూలి గిట్టుబాటు



హన్మాజీపేట్‌లో కూలీలకు పని కొలతలపై అవగాహన కల్పిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్

బాన్సువాడ రూరల్, మే 5 : ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలకు రోజువారి కూలి గిట్టుబాటు కావాలంటే తప్పని సరిగా కొలతల ప్రకారం పనులు చేయాలని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ గోపాల్ సూచించారు. బాన్సువాడ మండలంలోని హన్మాజీ పేట్ గ్రామంలో సోమవారం పని ప్రదేశం వద్ద పనుల కొలతలపై ప్రత్యక్షంగా కూలీలతో పని చేయిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ క్షేత్రసహాయకుడు ఇచ్చే కొలతల ప్రకారం పనులు చేయాలని కూలీలకు సూచించారు. కొలతల ప్రకారం పనులు చేయకుంటే తక్కువ కూలి వస్తుందని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత తీర్చాలి



నిజాంసాగర్‌లోని తహసీల్ కార్యాలయంలో హమాలీల కొరతపై ఫిర్యాదు చేస్తున్న వడ్డేపల్లి గ్రామస్తులు

నిజాంసాగర్, మే 5 : కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత తీర్చాలని రైతులు కోరారు. వడ్డేపల్లి గ్రామానికి చెందిన రైతులు మండలంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ భిక్షపతిని వారు కోరారు. కొనుగోలు కేంద్రంలో నెలకొన్న సమస్యలపై ఏపీఎంకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## పదో తరగతి టాపర్లకు సన్మానం



పదోతరగతి టాపర్లను సన్మానిస్తున్న ఏఏపీసీ కమిటీ సభ్యులు

కామారెడ్డి/మాచారెడ్డి, మే 5 : ఇటీవల పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో గంజ్ ఉన్నత పాఠశాలలో 500 మార్కులపైన సాధించిన ఎనిమిది మంది విద్యార్థులను ఏఏపీసీ కమిటీ తరఫున సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ సవిత, వార్డు మాజీ కౌన్సిలర్ ముప్పారపు ఆనంద్, ఏఏపీసీ కమిటీ సభ్యురాలు లక్ష్మి, రాధిక, అనామిక, ప్రధానోపాధ్యాయుడు నీలం లింగం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని సబా తబస్సుమ్‌ను జిల్లా స్థాయిలో 581 మార్కులు సాధించినందుకు సోమవారం తహసీల్ కార్యాలయం లో మండల అధికారులు సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తహసీల్దార్ శ్వేత, ఎంఈవో దేవేందర్‌రావు, ఎంపీడీవో గోపిబాబు, ఎంపీవో నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు వెంకటాచారి పాల్గొన్నారు.

## యోగా భవన్‌కు టీవీ వితరణ



యోగా భవన్‌కు టీవీని అందజేస్తున్న యోగా టీచర్

కామారెడ్డి, మే 5 : జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌కు 22వ బ్యాచ్ అసిస్టెంట్ యోగా టీచర్ వెంకటేశ్ తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం స్మార్ట్ టీవీని బహూకరించారు. కార్యక్రమంలో యోగా గురువు రాంరెడ్డి, యోగా సభ్యుడు బాస రఘుకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం - కేసు నమోదు

ఎల్లారెడ్డి రూరల్, మే 5 : బాలిక అదృశ్యమైనట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన దేవావత్ భానుకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురైన దేవావత్ నిధారాణి గత నెలలో 10వ తరగతి పరీక్షలు రాసి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటుంది. ఏప్రిల్ 28వ తేదీన నిధారాణి.. కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండగా బయట ఉన్న లైట్లను ఆన్‌చేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. ఎంత సేపటికీ ఇంట్లోకి రాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో నిధారాణి తల్లి దేవావత్ భాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



పెద్దకొడప్‌గల్‌లో కరాటేలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు



రామారెడ్డిలో యోగాలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

నస్రుల్లాబాద్/రామారెడ్డి/పెద్ద కొడప్‌గల్, మే 5 : బీర్కూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఇన్‌చార్జి ఎంఈవో వెంకన్న సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిబిరంలో అథ్లెటిక్స్, వాలీబాల్, చెస్, డిస్క్ త్రో తదితర క్రీడా పోటీలతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు 15 రోజులపాటు శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు, ఇన్‌చార్జి హెచ్ఎం రాధాకృష్ణ, ప్రసాద్, మేకల విఠల్ తదితరులు ఉన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని మండల విద్యాధికారి ఆనందరావు ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు యోగా, ఫుట్‌బాల్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, బాలికల పాఠశాల ఉపాధానోపాధ్యాయుడు సురేశ్, సీఆర్‌పీలు మహమూద్, సురేఖ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దకొడప్‌గల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథ మిక పాఠశాలలో 15వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11.40 గంటల వరకు ఉచిత సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో స్పోకెన్ ఇంగ్లిష్, కరాటే, యోగాపై ఉచితంగా 13 ఏండ్లలోపు ఉన్న బాల బాలికలకు శిక్షణ అందిస్తామన్నారు. శిక్షణకు కోర్స్ డైరెక్టర్‌గా ప్రధానోపాధ్యాయురాలు కమల, శిక్షకులుగా శివప్రసాద్, సాయిలు వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు మండలంలోని ఏ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో లీడ్ బ్యాంక్ సమావేశం

ఎల్లారెడ్డి రూరల్, మే 5 : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో లీడ్ బ్యాంకుల ఆధ్వర్యంలో సోమవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో భాగంగా ఎల్‌డీఎం చంద్రశేఖర్, డీపీఎం రవీందర్‌రావు మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలల వ్యవధిలో సమావేశాన్ని ఏర్పాటుచేయాలన్నారు. ఆర్థిక ప్రణాళికపై పురోగతి సమీక్ష, జిల్లా క్రెడిట్ ప్లాన్ కింద బ్యాంకుల పనితీరును వారు సమీక్షించారు. విద్యా రుణాల మంజూరు, బ్యాంకులు సకాలంలో డేటాను సమర్పించడంపై వారు మాట్లాడారు. సమావేశంలో ఎల్లారెడ్డి ఎంపీడీవో ప్రకాశ్, ఎల్లారెడ్డి ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ మల్లేశ్, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ మండలాలకు సంబంధించిన బ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కారు, ఆటో ఢీ : పలువురికి గాయాలు

ఎల్లారెడ్డి రూరల్(నాగిరెడ్డిపేట్), మే 5 : కారు-ఆటో ఢీకొనడంతో పలువురికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి నాగిరెడ్డిపేట్ మండలం తాండూర్ గేట్ వద్ద చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జోగిపేట్ మండలం గోమారానికి చెందిన హుస్సేన్ ఆటోలో ఎల్లారెడ్డి వైపు నుంచి వస్తున్నాడు. జలాల్‌పూర్ గ్రామానికి చెందిన మల్లేశం కారులో గోపాల్‌పేట్ నుంచి ఇంటికి వెళ్తున్నాడు. తాండూర్ గేట్ వద్ద ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

**ఆటోను ఢీ కొట్టిన బైక్..**

ఎల్లారెడ్డి రూరల్, మే 5 : ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం.. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డికి చెందిన సాలె సాయిలు ఈ నెల 4వ తేదీన కుటుంబ సభ్యులతోపాటు తన ఆటోలో బాన్సువాడకు వెళ్లి తిరిగి ఎల్లారెడ్డికి వస్తున్నాడు. తిమ్మారెడ్డి శివారులో ఉన్న కొత్త హనుమాన్ మందిరం వద్ద ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడకు వెళ్తున్న విక్రమ్ తన బైక్‌ను అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న సాయిలు ఆటోను ఢీ కొట్టాడు. ప్రమాదంలో సాయిలు కాలుకు గాయాలయ్యాయి. బాధితుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహిళ అదృశ్యం

కామారెడ్డి రూరల్, మే 5 : దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ అదృశ్యమైనట్లు దేవునిపల్లి ఎస్సై రాజు సోమవారం తెలిపారు. ఉగ్రవాయికి చెందిన హొలియ దాసరి కర్రెపు క్రీస్తుమణి బాసాన్లు విక్రయిస్తుంది. ఆదివారం కూరగాయలు తీసుకువస్తానని కామారెడ్డికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. తల్లి పోశవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**LOST**

★ I, D.SANTOSH, S/o. Hari Singh, R/o. Sangam (V), Narsullabad (M), Kamareddy (D), have Lost My Passport bearing No. T9931378, while travelling from Sangam to Narsullabad on Bike on 27-01-2025. Anybody found, Contact: 9951836678.
NT-HYD

**PASSPORT LOST**

I, Naresh Babu Parupally S/o. P.Rajaram Babu, H.No.3-4-123, Yellareddy and Vill & Mdl, Kamareddy Dist. T.S., India., Passport bearing No.H3891038 while I am travelling from my home H.No. 3-4-123 to Xerox center on 28-04-2025 and it could not be traced out.If anybody found Pls Cont.Cell: 7396724539

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## పుస్తె, మెట్టెలు అందజేత

రాజంపేట, మే 5 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మంద రాజమణి బాలయ్య దంపతుల కుమార్తె లావణ్య వివాహానికి నాగోల్‌లోని ఉప్పల్ క్యాంపు కార్యాలయంలో టూరిజం డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా స్వప్న దంపతులు పుస్తె, మెట్టెలు, చీరగాజులు సోమవారం అందజేసినట్లు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్, హైమద్, ఉపాధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


## మద్యం తాగి వాహనాలు నడుపొద్దు

లింగంపేట, మే 5 : వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ట్రైనీ ఎస్సై రాఘవేం ద్ర వాహనదారులకు సూచించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేస్తున్న వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపనున్నట్లు తెలిపారు. కార్లలో ప్రయాణం చేసే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. గూడ్స్ వాహనాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పీఎస్సై వెంట పోలీసు సిబ్బంది జువ్వినాయక్, మదన్‌లాల్, సాయిలు తదితరులు ఉన్నారు.

## మైనారిటీ పాఠశాలలో కొనసాగుతున్న అడ్మిషన్లు

ఎల్లారెడ్డి రూరల్, మే 5 : పట్టణంలోని తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్లు కొనసాగుతున్నట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ రఫత్ తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లతోపాటు 6, 7, 8, 9వ తరగతుల్లో పరిమిత సంఖ్యలో బ్యాక్‌లాగ్ మైనారిటీ క్యాటగిరీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. 2024-25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుకున్న విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. 5వ తరగతిలో మొత్తం 40 సీట్లకుగాను 30 సీట్లు మైనారిటీ విద్యార్థులకు, ఐదు సీట్లు బీసీలకు, రెండు సీట్లు ఎస్సీలకు, రెండు సీట్లు ఎస్టీలకు, ఓసీలకు ఒక సీటు చొప్పున కేటాయించినట్లు తెలిపారు. నాన్ మైనారిటీ సీట్లకు వచ్చిన దరఖాస్తుల్లో ఈ నెల 8వ తేదీన లక్కీ డీప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన, పోషకాహారంతో కూడిన భోజనం, ఉచితంగా స్కూల్ యూనిఫాంలు, స్పోర్ట్స్ డ్రెస్, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, కాస్మొటిక్ కిట్స్ ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. 24 గంటల వైద్య కోసం స్టాఫ్‌నర్స్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగి ఆసక్తి ఉన్న విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7331170815, 9705346569 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

## కరడ్‌పల్లిలో పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరంలో టీకాలు వేస్తున్న పశు వైద్యుడు

లింగంపేట(తాడ్వాయి), మే 5 : తాడ్వాయి మండలం కరడ్‌పల్లి గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించినట్లు పశు వైద్యాధికారి రమేశ్ తెలిపారు. శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 456 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఎల్‌వో పోశయ్య, జేవీవోలు కొండల్‌రెడ్డి, ప్రేమ్‌సింగ్, సిబ్బంది మహిపాల్‌రెడ్డి, బాలచందర్, ఎల్లయ్య, కిష్టయ్యతోపాటు గ్రామానికి చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.

## రైతుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభం

రామారెడ్డి(సదాశివనగర్), 5 : సదాశివనగర్ మండల కేంద్రంలో ఆధార్‌తో దేశంలో ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతి రైతుకు 11 అంకెలతో విశిష్ట సంఖ్య యూనిక్ కోడ్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతుల గుర్తింపు కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రైతులతోపాటు క్లస్టర్ వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీకొన్న ఆటో : పలువురికి గాయాలు

నిజాంసాగర్, మే 5 : ఆటో చెట్టును ఢీకొని పలువురికి గాయాలైన ఘటన నిజాంసాగర్ మండలం సుల్తాన్‌నగర్ శివారులో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లాకు చెందిన మేస్త్రీలు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్‌లో పని నిమిత్తం ఆటోలో బయల్దేరారు. ఆటో సుల్తాన్‌నగర్‌కు చేరుకోగానే అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆటోలోని హబీబ్, బషీర్, జాహిద్, జాకీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను బాన్సువాడ ఏరియా దవాఖానకు తరలించారు.

## డాక్టర్ రవీంద్రమోహన్‌కు గ్లోబల్ అపెక్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్

ఎల్లారెడ్డి రూరల్, మే 5 : ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్‌కు గ్లోబల్ అపెక్స్ అవార్డు వచ్చింది. ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గ్రామీణ ప్రాంతాల్లో అందించిన ఉత్తమ వైద్య సేవలకుగాను గ్లోబల్ అపెక్స్ అవార్డును ఇచ్చి గౌరవించారు. డాక్టర్ రవీంద్రమోహన్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

## మురికికాలువల నిర్మాణ పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, మే 5 : మండలంలోని దేవునిపల్లి గ్రామంలో మురికి కాలువల నిర్మాణ పనులను స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్‌లోని 4, 8వ వార్డులకు కలిపి సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణాలకు రూ.కోటీ 74 లక్షలను ఎమ్మెల్యే మంజూరు చేయించారని, దాంట్లో భాగంగా మురికికాలువల నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేశామన్నారు. దేవునిపల్లి వార్డు ప్రజల తరఫున స్థానిక ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గ్రామస్తులు ఉన్నారు.

## చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఆరు తులాల బంగారం, 86 తులాల వెండి రికవరీ

బాన్సువాడ, మే 5 : పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసును ఛేదించినట్లు పట్టణ సీఐ అశోక్ తెలిపారు. సోమవారం పట్టణ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడలోని సంగమేశ్వర కాలనీలో గత నెల 20వ తేదీన కూతురితో చెన్నంగారి లక్ష్మి ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రించారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడి చోరీ చేశాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. సోమవారం సాయంత్రం గాంధీచౌక్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో పట్టుకొని ఆరా తీయగా ఆ వ్యక్తి బోర్లం క్యాంపుతండాకు చెందిన నేనావత్ ఈశ్వర్‌గా గుర్తించామన్నారు. అతడిని విచారించగా సంగమేశ్వర కాలనీలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. అతడి నుంచి ఆరు తులాల బంగారం, 86 తులాల వెండిని రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కానిస్టేబుల్ అశోక్, హోంగార్డు హేమాద్రిని పట్టణ సీఐ అభినందించారు.